క్లుప్తంగా

పరవళ్లు తొక్కుతున్న తీలేర్ పెద్దచెరువు



మరికల్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తీలేర్ పెద్దచెరువు పరవళ్లు తొక్కుతోంది. పై నుంచి వరద నీరు రావడంతో చెరువులోకి భారీగా నీరుచేరడంతో మంగళవారం తెల్లవారుజామునుంచి అలుగుపారుతుందని గ్రామస్తులు తెలిపారు. చెరువులో చేపలు నీటిలో బయటకు వెళ్లకుండా మత్స్యకారులు అలుగుకు అడ్డంగా వలలు ఏర్పాటుచేశారు. తీలేర్‌తోపాటు మరికల్ పెద్దచెరువు, నాయిన్ చెరువు, కనకల్ చెరువులు అలుగుపారుతున్నాయి.

జాతర ఏర్పాట్ల పరిశీలన

నారాయణపేట రూరల్: మండలంలోని లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించే జాతర సందర్భంగా శాంతిభద్రతలు, ట్రాఫిక్ తదితర చర్యలపై సీఐ రవిబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్ పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడి పార్కింగ్, దర్శనానికి భక్తులకు క్యూలైన్స్ ఏర్పాటు చర్యలపై సమీక్షించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలను చూసుకున్నారు.

వంటగది ఏర్పాటుచేయండి



ధన్వాడ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో వంటగది లేక వంటకూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడుతుండటంతో వంటచేసేందుకు ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి వంటగదినిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఏర్గాట్‌పల్లిలో బాలుడికి డెంగీ

ఊట్కూర్: మండలంలోని ఏర్గాట్‌పల్లిలో హేమంత్‌కుమార్ అనే బాలుడికి డెంగీ రావడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారం రోజుల క్రితం జ్వరం రాగా.. నారాయణపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయగా డెంగీ లక్షణాలు ఉన్నాయని వైద్యులు చెప్పడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై పులిమామిడి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ సాయిరాం స్పందిస్తూ బాలుడికి డెంగీ లక్షణాలు ఉండడంతో కుటుంబ సభ్యులు నీలోఫర్ ఆస్పత్రికి తరలించారన్నారు. గ్రామంలో ముందస్తుగా వైద్యశిబిరం ఏర్పాటుచేసి రక్త నమూనాలు సేకరిస్తామని, పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులతోపాటు, ఫాగింగ్ చేయిస్తామని వివరించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

నారాయణపేట రూరల్: మండలంలోని బండగొండ, కోటకొండ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరిరాములు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పాత ఇళ్లల్లో నివసించే వారు వర్షాలు తగ్గే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, డ్రముల్లో, సంపుల్లో ఉన్న నిల్వ నీటిని పారబోయాలన్నారు. మున్సిపాలిటీ సిబ్బందితో నిత్యం పారుశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వర్షంలో కొనసాగుతున్న రిలేదీక్షలు



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని 226వ రోజు మంగళవారం వర్షం పడుతున్నా సాధన సమితి సభ్యులు రిలేదీక్షలను కొనసాగించారు. మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కృష్ణాలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు



నారాయణపేటలో..

రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం



మక్తల్‌లో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు సర్వేపల్లి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా కలిసి ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. రాధాకృష్ణన్ తన జీవితంలో ఉపాధ్యాయుడి నుంచి రాష్ట్రపతి వరకు దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

కోస్గి: సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులందరూ ఆదర్శంగా తీసుకోవాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రమేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల విద్యావనరుల కేంద్ర ప్రాంగణంలోని సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్టీయూ నాయకులు రవిప్రకాష్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య, హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూజలుచేసి నివాళులర్పించారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా నాగభూషణం, నల్లె శివరాజ్, రాంరెడ్డి, వినోద్‌కుమార్‌లతోపాటు గోపాల్ టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రటానికి పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

నర్వ: మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గోవింద్, శ్రీనివాస్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ తపస్, యూటీఎఫ్, వివిధసంఘాల నాయకులు శాలువా పూలమాలతో సన్మానించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూరం వెంకటేష్, రాజేష్‌కుమార్, నాగరాజు, సీఆర్పీలు నర్సింహులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నర్సింహులు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు ప్రధాత ఉపాధ్యాయుడేనని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. అన్ని వృత్తులలో ఉత్తమమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. అలాగే పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏలాంటి సమస్యలు రాకుండా చూసుకోవడమే లక్ష్యమన్నారు.

మక్తల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని రిటైర్డ్ ఉపాధ్యాయులకు పూలమాల శాలువాతో సన్మానం చేశారు. ఈ మేరకు పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల దేనన్నారు. అదేవిధంగా బాలుర ఉన్నతపాఠశాలలో మంగళవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనా హెచ్ఎం నర్సిరెడ్డిని జెడ్పీవైస్‌చైర్‌పర్సన్ వనజమ్మ పూలమాలతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు మనోహర్‌రావు, సంతోష్, గోపాలం, భాస్కర్, నాగప్ప, జీహెచ్ఎం అనిల్‌గౌడ్, దత్తురావు, వెంకట్‌రాములు, రమేష్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అంబాదాస్, ఉపాధ్యాయులు అనిల్‌గౌడ్, చంద్రశేఖర్, అనంతరెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, జయప్రకాష్, నర్సిరెడ్డి, రాజన్న, బాబు, విభూషణ్ పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలోని పాఠశాలలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, అధ్యాపకులు సత్యనారాయణ, బసయ్య, మంజునాథ్, కల్పన, మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్దూరు: సర్వేపల్లిరాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ విగ్రహానికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్, సీహెచ్ఎం ఆంజనేయులు, సమద్ పూలమాలవేసి నివాళులర్పించారు. సర్వేపల్లి ఉపాధ్యాయ వృత్తికి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, పారిజాత, రవికుమార్, ఆంజనేయులు, సుభాష్, కృష్ణారెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

దామరగిద్ద: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వివిధ పాఠశాలల్లో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తమ ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం సన్మానించి బహుమతులు అందజేశారు. అలాగే ఆయా గ్రామాలకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గుండప్ప, నారాయణ, బాలకిష్టయ్య, మొగులప్ప, నాగేందర్, నారాయణ పాల్గొన్నారు.



మాగనూర్‌లో..



ఊట్కూర్‌లో..



ధన్వాడలో..



మద్దూరులో..



మరికల్‌లో..

మహిళలకు అండగా 'మిషన్ శక్తి'



ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులతో మిషన్‌శక్తి సభ్యులు

ఆత్మకూర్: శిశు సంక్షేమ శాఖ, డీహెచ్ఈడబ్ల్యూ మిషన్‌శక్తి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు మానసిక, శారీరక వేధింపులకు గురవుతుంటే మిషన్‌శక్తికి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ర్యాగింగ్ ఇతర సమస్యలు తలెత్తినప్పుడు 1098, 100, 181, 14567 హెల్ప్‌లైన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌కు జైలుశిక్ష

దామరగిద్ద: లైన్‌మన్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ఫీల్డ్ వర్కర్ ప్రమాదానికి గురై రెండు చేతులు విరిగిపోయాయి. దీనికి కారణమైన లైన్‌మన్ శ్రీహరికి జూనియర్ సివిల్‌జడ్జి పర్విన్‌బేగం మంగళవారం 18నెలల జైలుశిక్ష, రూ.1000ల జరిమానా విధించింది. 2015లో మండలంలోని దామరగిద్ద సబ్‌స్టేషన్‌లో శ్రీహరి పనిచేస్తున్న సమయంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఫీల్డ్ వర్కరు మోహన్ ప్రమాదానికి గురయ్యాడు. ఈ కేసులో మంగళవారం తీర్పు వెలువడింది. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన ఎస్ఐ, సీఐలను ఎస్పీ అభినందించారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



రిలేదీక్షలో సమగ్రశిక్ష ఉద్యోగులు

నారాయణపేట రూరల్: సమగ్రశిక్ష ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని యూటీఎఫ్ నాయకులు వేణుగోపాల్, భీమయ్య, రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక వివేకానంద మున్సిపల్‌పార్క్‌వద్ద మంగళవారం రిలేదీక్షలను ప్రారంభించారు. వీరికి మద్దతు తెలిపిన యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని, మినిమం టైం స్కేల్ ఇవ్వడం లేదని వాపోయారు. ఉద్యోగభద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రసూతి సెలవులు కేటాయించాలని, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎల్లగౌడ్, అల్తాఫ్ హుస్సేన్, కృష్ణారెడ్డి, రాఘవేంద్రనాయకుడు, పావనిసింగ్, రాజశేఖర్‌గౌడ్, రాజు, నారాయణ, మహిపాల్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు


ఊట్కూరు: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నెల 12న నిర్వహించే నాయీబ్రాహ్మణ ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు తారాకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్నారని, ప్రభుత్వం పెన్షన్, హెల్త్‌కార్డు మంజూరు చేయాలని కోరారు. బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలను అందించాలన్నారు. కార్యక్రమంలో సిద్ది రామప్ప, రవి, నరేష్, పవన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మాగనూర్: మండల పరిధిలోని మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన చెట్టు కింద బాల్‌రాజు అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం నేరడగం పెద్దవాగు నుంచి మక్తల్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మార్గ మధ్యంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన డయల్ 100సిబ్బంది కృష్ణప్రసాద్, రవీందర్‌నాయక్ అనుమానం వచ్చిన ట్రాక్టర్‌ను తనిఖీచేయగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై కానిస్టేబుల్ రవీందర్‌నాయక్ ఫిర్యాదుమేరకు ఎస్ఐ మల్లేష్ డ్రైవర్ బాల్‌రాజుపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డుపై పారుతున్న మురుగు



మద్దూరు: మండల కేంద్రంలోని ఉల్లాస్‌నగర్ కాలనీలో అసంపూర్తి అండర్ డ్రెయినేజీతో సీసీరోడ్డుపైనే మురుగుపారుతుంది. దీంతో కాలనీవాసులకు దుర్వాసన, దోమలబెడద తప్పడం లేదు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అండర్ డ్రెయినేజీ దస్తప్ప ఇంటివరకు మాత్రమే నిర్మాణం చేపట్టి వదిలేశారు. అలాగే ఐసీడీఎస్ కార్యాలయం నుంచి మరో అండర్ డ్రెయినేజీ ఇక్కడే వదిలేయడంతో మురుగునీరు పారడం లేదు. రెండు డ్రెయినేజీలను పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నిత్య విద్యార్థిగా వ్యవహరించాలి



ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్

• కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థిగా వ్యవహరించాలని, పిల్లలకు భారంగా ఉండే చదువు కంటే వారి కలల ప్రపంచానికి దగ్గరగా ఉండే విద్యను బోధించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశంలో మంగళవారం సామాజిక సేవాకర్త ఎల్.గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో వెలుగు అభ్యాసనమిత్ర కార్యక్రమానికి అవసరమైన లెవల్ 1,2,3 వర్క్‌బుక్స్ రచయితలైనా 37మంది టీచర్లను శాలువా, జ్ఞాపికలతో కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజలు చేసి మాట్లాడారు. తరగతి గదిలో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించడానికి బోధన అభ్యాసన సామగ్రిని తయారు చేయడం అభినందనీయమన్నారు. వీటిని టీచర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ కుటుంబం కంటే పాఠశాలలో విద్యార్థులే సర్వస్వంగా పనిచేసే టీచర్లు చాలా మంది ఉన్నారని, వారి ద్వారా ఎంతోమంది భావి భారత పౌరులు తయారవుతున్నారని చెప్పారు. డీఈఓ కార్యాలయ అధికారులు నర్సింహారెడ్డి, విద్యాసాగర్, శ్రీనివాస్, డీఆర్పీలు భాస్కర్‌రెడ్డి, అపర్ణ, శ్రీకాంత్, నరేందర్, రాఘవేంద్ర, మల్లేష్, హిమబిందు, భానుశ్రీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

• ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మక్తల్: పేదల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాలకు చెందిన కుర్వ కులస్తులు, వివిధ పార్టీల కార్యకర్తలు సుమారు 50 మంది బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మారుతిగౌడ్, నర్సింహారెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



నారాయణపేట రూరల్: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కర్ణాటక ఉడిపికి చెందిన విద్వాన్ రుషికేశాచారి, ఆంధ్రప్రదేశ్ మంత్రాలయం గురువు రాఘవేంద్రాచారి, ప్రాజెక్టు అధికారి వాదిరాజ్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం నిర్వహించిన హరిదాసుల గానకచేరి అలరించింది.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు..

ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్ మేఘా, బీఆర్ఎస్ నాయకులు ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అతిథులకు జ్ఞాపికలు అందించారు.

'కల్యాణ లక్ష్మి' పేదలకు వరం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు

కోస్గి: పేదింట్లో ఆడపిల్లపెళ్లిభారం కాకుడదనే లక్ష్యంతో దేశంలో ఎక్కడలేని విధంగా కేసీఆర్ అమలుచేస్తున్న కల్యాణలక్ష్మిపథకం పేదలకు వరంలాంటిదని, అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీపీ మదుకర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం గుండుమాల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రభుత్వంనుంచి మంజూరైన కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండునాయక్, ఆర్ఐ వెంకట్రాములు, ఉపసర్పంచ్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



పేటలో డాక్టర్ బాలాజికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

నారాయణపేట రూరల్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రి, మండలంలోని కోటకొండ పీహెచ్‌సీ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. పారితోషికం పేరుతో పనిభారం మోపుతున్నారని, శ్రమదోపిడి చేస్తున్నారని విమర్శిచారు. పెండింగ్ పీఆర్‌సీ, డీఎ, లెప్రసీ, శిక్షణ డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. కనీసవేతనం రూ.18వేలు చెల్లించాలని, ప్రమాదభీమా రూ.25లక్షలను ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం వైద్యాధికారులు డాక్టర్ బాలాజి, డాక్టర్ నందినిలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగమణి, రాధిక, అంజమ్మ, సావిత్రమ్మ, నర్సమ్మ, జ్యోతి, శాంతి పాల్గొన్నారు.

మాగనూర్: ఆశాకార్యకర్తలకు కనీసవేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కో- కన్వీనర్ పుంజనూర్ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల వైద్యాధికారి నాగరత్నంకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ఆశాకార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయకుండా పారితోషికం పేరుతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. ఉద్యోగభద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: ప్రభుత్వం పారితోషికం పేరుతో ఆశాకార్యకర్తల శ్రమను దోపిడి చేస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు కెఎం. మహేందర్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు డా.కేశవ్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పద్మ, శివలింగమ్మ, లక్ష్మీ, అంజమ్మ, లలిత, మణెమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.



నర్వలో..

ఊట్కూరు: ఆశావర్కర్లకు కనీసవేతనం రూ.18వేలు చెల్లించాలని యూనియన్ గౌరవ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పీహెచ్‌సీ ఎదుట ధర్నాచేసి డాక్టర్ హబీబ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు శివమ్మ, బాలమణి, సావెరాభేగం, పద్మమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.